

గంజాయి సేవిస్తే అంతే...

గంజాయి తాగిన వారిని గుర్తించేందుకు పరీక్ష కిట్లు జిల్లాకు చేరుకోగా.. త్వరలోనే టెస్ట్‌లు మొదలుపెట్టనున్నారు. 8లో



బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

భారీ వర్షాల కారణంగా సింగరేణి పరిధిలోని అన్ని ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. 8లో



వాతావరణం

జిల్లాలోని పలుచోట్ల గురువారం చిరు జల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

కమనీయం.. కళ్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో బుధవారం స్వామి వారి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన పూజలు చేశారు. ఆతర్వాత బేడా మండపంలో కొలువుదీర్చి స్వామికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం స్వామికి కంకణధారణ, యజ్ఞోపవేత ధారణ, సీతమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించిన అర్చకులు నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా పూర్తిచేశారు.

16న వరలక్ష్మి వ్రతం

శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. ఈ ఐదు రోజుల పాటు నిత్యకల్యాణాన్ని రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే, శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని 16వ తేదీన ఆలయంలో వరలక్ష్మి వ్రతం, బేడా మండపం వద్ద సాయంత్రం 4 గంటలకు సామూహిక కుంకుమార్చన జరపనున్నారు. ఈ పూజల్లో పాల్గొనేందుకు మహిళలు రూ.200 చెల్లించాలని ఈఓ రమాదేవి ఓ ప్రకటనలో సూచించారు.

నేర పరిశోధనకు ప్రశంస



డీఐజీ నుంచి ప్రశంసపత్రం అందుకుంటున్న కరుణాకర్

అశ్వారావుపేట: ఓ హత్య కేసును పకడ్బందీగా ఛేదించిన అశ్వారావుపేట సీఐ కరుణాకర్ డీజీపీ డాక్టర్ జితేందర్ చేతుల మీదుగా ప్రశంసలు అందుకున్నారు. ఆయన చుంచుపల్లి సీఐ గా పనిచేసిన సమయాన అక్కడి హౌసింగ్ బోర్డు కాలనీలో ఓ మహిళ హత్యకు గురైంది. ఈ కేసును దిష్టిబొమ్మ ఆధారంగా ఛేదించి నేరస్తులకు జీవిత ఖైదు పడేలా చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈమేరకు కరుణాకర్‌కు డీఐజీ హైదరాబాద్‌లో ప్రశంసపత్రం అందజేయగా ఎస్పీ రోహిత్‌రాజు, సహచర ఉద్యోగులు అభినందించారు.

తక్కువ ధరలోనే జాతీయ జెండాలు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వీరభద్రస్వామి

భద్రాచలంటౌన్: పోస్టల్ శాఖ ఆధ్వర్యాన ఉమ్మడి జిల్లాలోని అన్ని పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలు విక్రయిస్తున్నట్లు ఖమ్మం డివిజన్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి తెలిపారు. భద్రాచలం హెడ్ పోస్టాఫీస్‌లో బుధవారం నిర్వహించిన పోస్ట్‌మాస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం రూ.25కే జెండాలు అందుబాటులో ఉన్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కాగా, ఆన్‌లైన్‌లోనూ జెండాలను ఆర్డర్ చేసే అవకాశముందని చెప్పారు. జెండాల అమ్మకం విషయమై సిబ్బంది విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. భద్రాచలం పోస్టల్ ఏఎస్పీ అశోక్‌కుమార్, పోస్ట్‌మాస్టర్ రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డీఐఈఓగా వెంకటేశ్వరరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్వరరావు


కొత్తగూడెం అర్బన్/భద్రాచలంటౌన్: జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిగా హెచ్. వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ప్రస్తుతం భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న ఆయనను డీఐఈఓగా నియమిస్తూ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శృతిఓజా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించడంతో ఉద్యోగులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను డీఐఈఓ మర్యాదపూర్వకంగా కలిశారు.


భద్రగిరిలో

భయం.. భయం

దక్షిణ అయోధ్యగా పేరున్న శ్రీసీతారామచంద్రస్వామి కొలువైన భద్రాచలం ఆలయ అభివద్ధిపై ప్రణాళిక లేకపోవడం.. పట్టణానికి మాస్టర్ ప్లాన్ రూపొందించడంలో జరుగుతున్న జాప్యం వెరసి ఏటా వానాకాలంలో సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో గోదావరి వరదల నుంచి సీతాసమేత శ్రీరాముడికి రక్షణ కల్పించే భద్రగిరులు ప్రమాదంలో పడ్డాయా అన్న సందేహాలు భక్తులను ఆవేదనకు గురిచేస్తున్నాయి.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం





ల్యాండ్ స్లైడింగ్ కారణంగా గాలిలో వేలాడుతున్న పగోడా, ల్యాండ్ స్లైడింగ్ జరిగిన గుట్ట వ్యూ పాయింట్

భారీ వర్షంతో అతలాకుతలమైన భద్రాచలం

- రంగనాయకుల గుట్టపై కుంగిన భూమి
- వ్యూ పాయింట్ పగోడా గాలిలో తేలియాడడంతో తొలగింపు
- ఆలయం చుట్టూ చేరిన మురుగునీరు
- ఏళ్లుగా కాగితాలకే పరిమితమైన మాస్టర్‌ప్లాన్

ల్యాండ్ స్లైడింగ్

భద్రగిరి కొండలపై శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం ఉండగా రంగనాయకులగుట్టపై కుసుమ హరినాథుడు, రంగనాథుడు, శివాలయం, రామదాసు భజన మందిరం ఉన్నాయి. వీటితో పాటు పదుల సంఖ్యలో ప్రైవేట్, ఆలయ కాటేజీలు ఉన్నాయి. ఆలయానికి ఎదురుగా నర్సింహస్వామి గుట్ట ఉండగా.. ఈ మూటింటి చుట్టూబ్రాహ్మణ బజార్, అంబసత్రంరోడ్డు, చప్టాదిగువ వీధి ఉంటాయి. ఇక్కడ జనావాసాలతో పాటు పలు ప్రైవేట్ లాడ్జీలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించారు. అనాదిగా భద్రాచలంలో గోదావరి వరద ఇబ్బంది పెట్టడం తప్పితే గుట్టలపై ల్యాండ్ స్లైడింగ్ జరిగిన దాఖలాలు లేవు. కానీ బుధవారం ల్యాండ్ స్లైడింగ్ ఘటన చోటు చేసుకోవడంతో భద్రాద్రి వాసులు ఉలికి పడ్డారు.

గాలిలో వేలాడుతూ...

ప్రధాన ఆలయానికి సమీపాన రంగనాయకుల గుట్టపై ఉన్న కుసుమ హరనాథ్ ఆలయానికి సంబంధించిన వ్యూ పాయింట్ పాక్షికంగా కూలిపోయింది. బుధవారం తెల్లవారుజాము నుంచి కురిసిన భారీ వర్షాలకు గుట్టపై భూమి కుంగిపోగా.. కుంగుబాటుకు సమీపాన వ్యూ పాయింట్ పాక్షికంగా దెబ్బతిన్నది. పునాది, ఫ్లోరింగ్‌కు ఉపయోగించిన రాళ్లు కిందికి జారి పడడంతో ఒక పిల్లర్ గాలిలో వేలాడుతుండగా మరో రెండు పిల్లర్ల పునాదులు కదిలిపోయాయి. కేవలం ఒక పిల్లర్ ఆధారంగా ఇప్పుడు నిర్మాణం గాలిలో వేలాడుతోంది. ఏ క్షణమైనా వ్యూ పాయింట్ కూలిపోయే అవకాశం ఉండడంతో ఆలయం దక్షిణ మాడ వీధిలో రాకపోకలు నిలిపేశారు. ఈ మార్గంలోకి ఎవరూ రాకుండా పోలీసులు గస్తీ కాశారు. ఆతర్వాత సాయంత్రానికి పగోడాను తొలగించారు.

ఏదీ ప్రణాళిక?

శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం మాస్టర్ ప్లాన్.. టెంపుల్ టౌన్‌గా భద్రాచలాన్ని అభివృద్ధికి చేయాలన్న కార్యాచరణపై అడుగు ముందుకు పడడం లేదు. ఇకనైనా మాస్టర్ ప్లాన్ల రూపకల్పనలో జాప్యాన్ని నివారించకుంటే పెను ప్రమాదం తప్పదనే సంకేతాలు బుధవారం వెలువడ్డాయి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఆలయం, పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామంటూ ప్రజాప్రతినిధులు చేసే ప్రకటనలు తప్ప కార్యరూపం దాల్చడం లేదు. గడిచిన పదేళ్లుగా ఆలయం చుట్టూ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకున్న వారు లేరు. వీటి ఫలితంగా ఎన్నడూ లేని విధంగా గుట్టల మీద మట్టి జారిపడుతోంది. సరైన డ్రెయినేజీ వ్యవస్థలేక ఆలయం చుట్టూ మురుగునీరు చేరుతోంది. ఇప్పటికైనా ఆలయ మాస్టర్‌ప్లాన్, పట్టణ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాల్సిన అవసరముందని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

మునిగిన విస్తా కాంప్లెక్స్



విస్తా కాంప్లెక్స్ చుట్టూ చేరిన వరద

పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో మురుగు నీటి పారుదల వ్యవస్థలోని లోపాలు బుధవారం మరోసారి బయటపడ్డాయి. ఉదయం 6నుంచి 11 గంటల వరకు కురిసిన భారీ వర్షం కారణంగా ఆలయం పరిసరాల్లోని విస్తా కాంప్లెక్స్, బొమ్మల దుకాణాలు, నిత్యాన్నదానసత్రం, కాపా రామలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్‌కు సంబంధించిన ప్రాంగణం చుట్టూ వరద చేరింది. ఎప్పటికప్పుడు వరద నీటిని గోదావరిలోకి మోటార్ల ద్వారా ఎత్తిపోయకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది. చివరకు నీటిని ఎత్తిపోసినా ఆ ప్రాంతంలో చెత్త, బురద పేరుకుపోయి అధ్వానంగా మారింది. ఈ పరిస్థితి ఇక్కడకు వచ్చే భక్తుల ఆధ్యాత్మిక భావనకు ఇబ్బందిగా మారుతోంది. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేని కారణంగా ఏటా వానాకాలంలో మురుగునీరు, వర్షపు నీటిని ఎత్తి పోయాల్సి వస్తోంది. తాత్కాలిక ఉపశమనం ఇచ్చే ఎత్తిపోతలకు ప్రతీసారి రూ.లక్షల్లో వెచ్చిస్తున్న అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. కాగా, బుధవారం భద్రాచలానికి చెందని ఓ వ్యక్తి డ్రెయినేజీలో పడి మృతి చెందగా.. గత ఏడాది ఓ మహిళా కానిస్టేబుల్ కాలువలో పడి చనిపోయింది. డ్రెయినేజీ వ్యవస్థలోని లోపాలు వరుసగా ప్రాణాలను మింగేస్తున్నా ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులకు చీమ కుట్టినట్లు లేకపవడం విమర్శలకు తావిస్తోంది.

సాగర్ ఆయకట్టుకు ఢోకా లేదు..

- 15న సీతారామ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పాలేరు ఎడమ కాల్వకు నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కూసుమంచి: వరుణ దేవుడి కరుణ, తదాస్తు దేవతల ఆశీస్సులతో ఇందిరమ్మ రాజ్యంలో పుష్కలంగా వర్షాలు కురిసి ప్రాజెక్టులు నిండినందున ఈ ఏడాది సాగర్ ఆయకట్టులో రెండు పంటలకు సరిపడా సాగునీరు అందుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మండలంలోని పాలేరు రిజర్వాయర్ నుండి జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి బుధవారం ఆయన సాగునీరు విడుదల చేశారు. ఈసందర్భంగా మంత్రి, కలెక్టర్ కృష్ణా జలాలకు పూజలు నిర్వహించి ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 37 మండలాల్లో 2.75లక్షల ఎకరాలకు పాలేరు నుండి సాగునీటి సరఫరా అవుతోందని తెలిపారు. అంతేకాక ఏపీలోని 1.25లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. సాగర్ డ్యాంలో పుష్కలంగా నీరు ఉన్న నేపథ్యాన రైతులు ఆనందంగా రెండు పంటలు సాగుచేసుకోవాలని మంత్రి సూచించారు.

కొరత రాకుండా...

ఎప్పుడైనా వర్షాభావ పరిస్థితులతో కృష్ణా జలాల కొరత ఏర్పడితే ఆ లోటు పూడ్చేందుకే సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను పాలేరుకు రప్పిస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ ప్రాజెక్టు మొదటి దశను ఈనెల 15న సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. సాగర్ ప్రాజెక్టుతో పాటు సీతారామ ద్వారా మేజర్, మీడియం ప్రాజెక్టులు, చెరువులను నింపి ఆయకట్టుకు నీరు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా అన్ని చెరువులను నింపి సాగుకు ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో జలవనరుల శాఖ సీఈ విద్యాసాగర్, ఈఈ అనన్య, డీఈఈ మధు, జేఈ నవీన్‌తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కాగా, పాలేరు నుంచి నీరు విడుదల నేపథ్యాన రెండు రోజుల్లో వైరా రిజర్వాయర్‌కు చేరతాయని అధికారులు తెలిపారు.

నేడు జిల్లాలో మంత్రి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8గంటలకు ఆయన ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామానికి వెళ్లనుండగా.. మధ్యాహ్నం 3గంటలకు సత్తుపల్లి మండలం యాతాలకుంటకు చేరుకుంటారు. అక్కడ సీతారామ ప్రాజెక్టు పనులను మంత్రి పరిశీలిస్తారు. ఆతర్వాత సాయంత్రం 5గంటలకు ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేటలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారు.



ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న వరద

తాలిపేరుకు పెరుగుతున్న వరద

- 24 గేట్లు ఎత్తి దిగువకు విడుదల

చర్ల: మండలంలోని తాలిపేరు మధ్య తరహా ప్రాజెక్టుకు మళ్లీ వరద ఉధృతి పెరుగుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మంగళవారం అర్ధరాత్రి నుంచి ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 25 గేట్లలో 24 గేట్లు ఎత్తి 89,954 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 74 మీటర్లు కాగా ఎగువ నుంచి వరద వస్తున్న నేపథ్యాన నీటి మట్టాన్ని 71.66 మీటర్లుగా క్రమబద్ధీకరిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యాన భారీగా వరద వచ్చే అవకాశమున్నందున అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.



కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తిన దృశ్యం

నిండుకుండలా కిన్నెరసాని జలాశయం

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసాని జలాశయానికి వరద పోటెత్తడంతో నిండుకుండను తలపిస్తోంది. 407 అడుగుల నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లోకి 21 వేల క్యూసెక్కుల వరద వస్తుండటంతో బుధవారం 404.20 అడుగులకు చేరింది. దీంతో నాలుగు గేట్లను ఎత్తి 20 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా, నాలుగు గేట్లను ఎత్తడంతో రాజాపురం, యానంబైల్ మధ్య లోలెవల్ చప్టాపైకి వరద చేరగా పలు గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

పాఠశాలలు పచ్చదనంతో కళకళలాడాలి

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్
- అశ్వాపురం మండలంలోని పాఠశాలల్లో తనిఖీ



సీతారాంపురం పాఠశాలలో సూచనలు చేస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

అశ్వాపురం: పాఠశాలలన్నీ పచ్చని మొక్కలతో కళకళలాడేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. అశ్వాపురం మండలంలో బుధవారం పర్యటించిన ఆయన సీతారాంపురంలో ప్రైమరీ, జిల్లా పరిషత్ పాఠశాలలను సందర్శించారు. ఈసందర్భంగా మొక్కలు నాటడంతో పాటు తరగతి గదులు, ఇంకుడుగుంతలను పరిశీలించాక విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం అశ్వాపురం ప్రైమరీ స్కూల్‌ను సందర్శించగా.. అక్కడ నీరు నిల్వ ఉండడంతో కలెక్టర్ స్వయంగా నీరు ముందుకు సాగేలా గడ్డపారతో కాల్వ తీశారు. ఆపై పాఠశాలలో శిథిలమైన తరగతి గదులను తొలగించాలని ఏఈని ఆదేశించారు. ఎంపీడీఓ వరప్రసాద్, ఎంఈఓ వీరస్వామి, ఆర్‌ఐలు నాగమణి, రాజేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు కృష్ణచైతన్య, వేణుప్రియ పాల్గొన్నారు.

బీజీ కొత్తూరు పంప్‌హౌస్ పరిశీలన

మండలంలోని బీ.జీ.కొత్తూరులో సీతారామ ప్రాజెక్ట్ ఫేస్-1 పంప్‌హౌస్‌ను కలెక్టర్ పాటిల్ సందర్శించారు. అధికారులతో మాట్లాడి మోటార్ల డ్రై రన్‌కు జరుగుతున్న ఏర్పాట్లపై ఆరా తీశారు. ఇప్పటికే రెండు మోటార్లు డ్రై రన్ చేయగా మిగిలిన నాలుగు త్వరలో పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు. డీఈ శ్రీనివాస్, ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో టెలీకాన్ఫరెన్స్

సూపర్‌బజార్(కొత్తగూడెం): స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్ జితేష్ వి.పాటిల్ జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మొదటి మూడు రోజుల మాదిరిగానే మిగిలిన రెండు రోజులు కూడా విజయవంతం చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో గురువారం ఫీవర్ సర్వే నిర్వహించడంతో పాటు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే, వన మహోత్సవం సందర్భంగా అన్ని పాఠశాలలు, హాస్టళ్లు, హెల్త్ సెంటర్లలో ఔషధమొక్కలతో పాటు మునగ, చింత, కరివేపాకు, వెలగ, ఉసిరి, పనస మొక్కలను నాటాలని సూచించారు. తాను తనిఖీకి వచ్చినప్పుడు ఎక్కడైనా మొక్కలు లేకపోతే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, శుక్రవారం అన్ని కార్యాలయాలు, ఆస్పత్రులు, పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు శుభ్రపర్చాలని కలెక్టర్ ఆదేశించారు.

జెడ్పీ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ పాటిల్



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్

చుంచుపల్లి: జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీ పాలకవర్గం గడువు మంగళవారంతో ముగియడంతో ప్రత్యేక అధికారిగా ఆయనను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. కార్యాలయం శిథిలావస్థకు చేరిన నేపథ్యాన మరమ్మతులకు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. అలాగే, ఉద్యోగులందరూ సమన్వయంతో పని చేయాలని చెప్పారు. జెడ్పీ సీఈఓ కె.చంద్రశేఖర్, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

భూగర్భ జలాలు పెరిగితేనే మేలు

కేంద్ర జలశక్తి అభియాన్ సభ్యుడు ఆసిఫ్ ఇస్మాయిల్



బూర్గంపాడు : వర్షపు నీరు నేలలోకి ఇంకేలా చేపట్టిన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ప్రతినిధులు

బూర్గంపాడు/కొత్తగూడెం రూరల్: భావితరాల భవిష్యత్ కోసం భూగర్భ జలాలు పెరిగేలా అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర జలశక్తి అభియాన్ సభ్యుడు ఆసిఫ్ ఇస్మాయిల్ సూచించారు. రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీనివాస్ విఠల్‌తో కలిసి బుధవారం ఆయన బూర్గంపాడు మండలంలోని మోరంపల్లిబంజర, లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల, బావోజీతండా, బంగారు చెలక, బొజ్జలగూడెం, మైలారం గ్రామాల్లో పర్యటించారు. మోరంపల్లిబంజర గ్రామపంచాయతీ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమై ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతల నిర్మాణ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. జలశక్తి – నారీశక్తి నినాదాన్ని మహిళలు నిజం చేయాలని కోరారు. ఆతర్వాత డ్వాక్రా సంఘాల సభ్యులతో కలిసి బతుకమ్మ ఆడడంతో పాటు ఇంకుడు గుంత నమూనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే, జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులతో నీటి పొదుపుపై ప్రతిజ్ఞ చేయించారు. ఇక లక్ష్మీదేవిపల్లి మండలంలోని గ్రామాల్లో పర్యటన సందర్భంగా అటవీ భూమిలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన హరితవనాలు, నీటి సంరక్షణ పనులను పరిశీలించారు. ఈకార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ విద్యా చందన, అదనపు డీఆర్డీఓ నల్లబోతుల రవి, ఎంపీడీఓలు చలపతిరావు, జమలారెడ్డి, ఏపీఓలు వీరన్న, సునీల్, విజయలక్ష్మి, ఎస్‌బీఎం కోఆర్డినేటర్ రేవతితో పాటు వివిధ శాఖల ఉద్యోగులు సత్యనారాయణ, ప్రమీల, నాగార్జున, భవాని, బ్రహ్మదేవ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువతకు ఉపాధి కల్పించాలి



అధికారులతో సమీక్షిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: జిల్లాలోని మారుమూల ఆదివాసీ గిరిజన నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి వారికి జీవనోపాధి కల్పించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం ఆయన ఐటీసీ, కేటీపీఎస్, బీటీపీఎస్, జెన్కో, నవభారత్ కంపెనీల మేనేజర్లతో సమావేశమయ్యారు. విద్యార్హత ఉన్నా ఉద్యోగావకాశాలు లేని నిరుద్యోగ యువతకు కంపెనీల్లో శిక్షణ ఇచ్చి అవకాశాలు కల్పించాలని సూచించారు. అలాగే ఐటీసీ, నవభారత్ ద్వారా గిరిజన సంక్షేమ శాఖ, జీపీఎస్ పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్స్ కాక అంగన్‌వాడీ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అవసరమయ్యే సామగ్రి అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఓలు డేవిడ్‌రాజ్, మునీర్ పాషా, వివిధ కంపెనీల అధికారులు చంగల్‌రావు, శ్యాంకుమార్ కవాడియా, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, రమేష్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

11న సీతారామ ప్రాజెక్ట్ ట్రయల్ రన్?

అశ్వాపురం: సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తిస్థాయి ట్రయల్ రన్ ఈనెల 11న నిర్వహించనున్నట్టు సమాచారం. ఈనెల 15న ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యాన ట్రయల్ రన్‌కు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ట్రయల్ రన్‌ను రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించనున్నారని సమాచారం. ములకలపల్లి మండలం పూసుగూడెంలోని రెండో పంప్‌హౌస్, ఆతర్వాత వీకే.రామవరంలో మూడో పంప్‌హౌస్ వద్ద మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ట్రయల్ రన్‌ను ప్రారంభిస్తారని తెలిసింది. అయితే, అశ్వాపురం మండలం బీజీ.కొత్తూరు నుంచి నీరు విడుదల చేయాల్సి ఉండడంతో ఇక్కడి పంప్‌హౌస్‌ను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ బుధవారం సందర్శించారు. కాగా, ట్రయల్ రన్‌ను ప్రారంభించాక వైరాలో సీఎం సభకు జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి ఉత్తమ్ పరిశీలిస్తారని సమాచారం.

క్లుప్తంగా

రామయ్యను దర్శించుకున్న ఐఆర్‌ఎస్ అధికారి



ఆలయంలో మెహతా, అర్చక, ఉద్యోగులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామ చంద్ర స్వామి వారిని ఇన్‌కమ్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్, ఐఆర్‌ఎస్ అధికారి వి.మెహతా బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులకు పూజలు చేశారు. తర్వాత శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఉపాలయంలో పండితులు ఆయనకు ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు, అర్చకులు, పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలం ఎల్‌ఐసీ బ్రాంచ్ సందర్శన

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ఎల్‌ఐసీ బ్రాంచ్‌ను వరంగల్ డివిజన్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ల ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (1964) నాయకులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఏజెంట్ల సమావేశంలో వరంగల్ డివిజన్ అధ్యక్షులు వైవీ కృష్ణారావు మాట్లాడుతూ వరంగల్‌లో సెప్టెంబర్‌లో జరిగే జనరల్ బాడీ సమావేశానికి భద్రాచలం బ్రాంచ్ నుంచి భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. వరంగల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి గోపాల్‌రావు, నాయకులు బెల్లంకొండ శ్రీనివాస్, మోహన్‌రావు, సత్యనారాయణ, వేణుగోపాల్, వర్మ, మేకపోతుల నరసింహారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

75 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

సింగరేణి(కొత్తగూడెం): ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో సింగరేణివ్యాప్తంగా 11 ఏరియాల్లో 1.75 లక్షల టన్నులకు గాను లక్ష టన్నుల బొగ్గు ఉత్పత్తి కాగా.. మిగిలిన 75 వేల టన్నుల ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. కొత్తగూడెం రీజియన్‌లోని కొత్తగూడెం ఏరియాలో 13 వేల టన్నులు, ఇల్లెందులో 4 వేల టన్నులు, మణుగూరు ఏరియాలో 20 వేల టన్నుల ఉత్పత్తి నిలిచిపోయింది. కాగా, భారీ వర్షం కారణంగా ఓసీల్లో హాల్‌రోడ్లు బురదమయంగా మారడంతో డంపర్లు, డోజర్లు నిలిచిపోయాయి. అలాగే, లారీల ద్వారా బొగ్గు రవాణా సైతం స్తంభించింది.

హైకోర్టుకు చేరిన పెద్దమ్మగుడి ఫంక్షన్ హాల్ వివాదం

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయానికి చెందిన ఫంక్షన్ హాల్ అద్దె వివాదం హైకోర్టుకు చేరింది. ఆలయం పరిధిలో రెండు ఏసీ ఫంక్షన్‌హాళ్లు ఉండగా.. ఏడాది కిందట ప్రైవేట్ వ్యక్తులకు అద్దెకు ఇచ్చారు. అయితే పెద్ద ఫంక్షన్ హాల్‌ను మహేశ్ అనే వ్యక్తి ఏడాది కాలానికి గాను రూ.44 లక్షలకు పైగా అద్దెతో దక్కించుకున్నారు. తొలుత రూ.20 లక్షల మేర చెల్లించినా మిగతా నగదు జూన్‌లో చెల్లించాల్సి ఉన్నప్పటికీ జాప్యం చేస్తున్నాడు. ఇదేమిటని అడిగితే ఫంక్షన్ హాల్‌లో సమస్యలు ఉన్నాయని చెబుతూ కాంట్రాక్టర్ రెండు రోజుల కిందట హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో ఇటీవల నోటీసులు జారీ కాగా బుధవారం రిట్ దాఖలు చేసినట్లు ఈఓ రజినికుమారి తెలిపారు.

కేసు నమోదు

బూర్గంపాడు: యాష్ కాంట్రాక్ట్ పనుల్లో వాటా ఇస్తామని చెప్పి ఓ వ్యక్తి నుంచి డబ్బులు తీసుకుని తిరిగి ఇవ్వని ఇద్దరు వ్యక్తులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేశ్ తెలిపారు. యాష్ కాంట్రాక్ట్ వర్క్‌లో వాటా ఇస్తామని చెప్పి ఉప్పుసాక గ్రామానికి చెందిన ధరావత్ రామకృష్ణ నుంచి మిర్యాలగూడెంనకు చెందిన రావులపల్లి రవికుమార్, పాల్వంచకు చెందిన కొర్సా రమేశ్ రూ.20 లక్షలు తీసుకున్నారు. ఎన్నిరోజులైనా కాంట్రాక్ట్‌లో వాటా ఇవ్వకపోగా.. ఇచ్చిన డబ్బులు అడిగినా ఇవ్వడం లేదని రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రవికుమార్, రమేశ్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజేశ్ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

ములకలపల్లి: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న మండలంలోని ఇద్దరు బాధితులకు పోలీసులు బుధవారం తిరిగి వాటిని అందించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాజశేఖర్ మాట్లాడుతూ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వ్యక్తులు వీలైనంత త్వరగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది భాను, ధర్మరాజు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న 'ఆన్‌లైన్' బాధితులు

వేంసూరు: రెండింతలు లాభం వస్తుందని నమ్మబలికి తొలినాళ్లలో సక్రమంగానే చెల్లించిన యాప్ నిర్వాహకులు ఆ తర్వాత ముఖం చాటేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. వేంసూరు మండలం కందుకూరుకు చెందిన ఇద్దరు రూ.2.80లక్షలు, రూ.93వేల మేర మోసపోయినట్లు మంగళవారం ఫిర్యాదు చేశారు. అయితే, బాధితుల సంఖ్య పెరుగుతోంది. బుధవారం మరో ముగ్గురు పోలీసులను ఆశ్రయించారు. వీరు రూ.1.80 లక్షలు, రూ.65వేలు, రూ.52 వేల చొప్పున మోసపోయామని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు.

గంజాయి సేవిస్తే అంతే..



జిల్లాకు చేరిన డ్రగ్ టెస్టింగ్ కిట్లు

- డ్రగ్ టెస్టింగ్‌లో ఇట్టే దొరికిపోతారు..
- జిల్లాకు డ్రగ్స్ టెస్టింగ్ కిట్లు
- త్వరలోనే మొదలుకానున్న పరీక్షలు

కొత్తగూడెంటౌన్: డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల ద్వారా మందుబాబులకు షాక్ ఇస్తున్న పోలీసు శాఖ ఇక నుంచి గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవించే వారిని ఇట్టే పట్టుకుని చర్యలు తీసుకోనుంది. ఇప్పటి వరకు బ్రీత్ అనలైజర్‌తో మద్యం సేవించిన పరిమాణాన్ని గుర్తించి కేసులు నమోదు చేశారు. ఇక నుంచి డ్రగ్ టెస్టింగ్ కిట్ (డ్రగ్ డిటెక్షన్ టెస్టు)లను ఉపయోగించి గంజాయి సేవించిన (మత్తు పదార్థాలను సేవించిన) వ్యక్తులను వాసనతో గుర్తించనున్నారు. కాగా, జిల్లాకు డ్రగ్ టెస్టింగ్ కిట్లు చేరుకున్నాయి. త్వరలోనే జిల్లాలోని పలు ప్రాంతాల్లో డ్రగ్ టెస్టింగ్ కిట్లను ఉపయోగించి గంజాయి సేవించేవారిని గుర్తించనున్నామని ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ఈ డ్రగ్ టెస్టింగ్ కిట్లు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఈ కిట్లను అందించనున్నారు. అవసరాన్ని బట్టి ఒక్కొక్క పోలీస్ స్టేషన్‌కు 4 నుంచి 10 వరకు కిట్లు అందజేయనున్నారు. అయితే, బ్రీత్ అనలైజర్ టెస్టు చేసిన విధంగానే గంజాయి సేవించినవారిని గుర్తించేందుకు డ్రగ్ టెస్టింగ్ కిట్లను ఉపయోగిస్తారు. ఇవి 12 రకాల మత్తు పదార్థాలను గుర్తిస్తాయని, నెల నుంచి 6 నెలల లోపు వ్యక్తి గంజాయి సేవించిన నమూనాలను సైతం గుర్తిస్తుందని పోలీసులు తెలిపారు.

గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం..



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గంజాయి మహమ్మారిని తరిమి కొట్టేందుకు కృషి చేస్తున్నాం. గంజాయి సేవించే వారు, రవాణా చేసే వారిని గుర్తించేందుకు ప్రత్యేక డ్రగ్ టెస్టింగ్ కిట్లను వినియోగిస్తాం. జిల్లాకు ఈ కిట్లను తెప్పించాం. ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఈ డ్రగ్ టెస్టింగ్ కిట్లను అందజేస్తాం. జిల్లావ్యాప్తంగా గంజాయి తనిఖీలను నిర్వహించి అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికడతాం. ప్రజలంతా మాకు సహకరించాలి. ఎవరైనా గంజాయి సేవించినా, రవాణా చేసినా డయల్ 100కు సమాచారం అందించాలి.

– బి.రోహిత్‌రాజు, ఎస్పీ

డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి

- మూడు గంటల పాటు శ్రమించి మృతదేహాన్ని బయటకు తీసిన సిబ్బంది
- కళ్ల ముందే గల్లంతవడంతో కన్నీరుమున్నీరైన భార్య



సతీశ్ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య సునీత



గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు, అధికారులు

భద్రాచలంఅర్బన్: ప్లాస్టిక్ సీసాల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి గల్లంతైన వ్యక్తి మూడు గంటలు తర్వాత శవమై దొరికాడు. మృతుడి భార్య సునీత కథనం ప్రకారం.. చర్ల మండలం పామేడుకు చెందిన సున్నం సతీశ్ – సునీత దంపతులు 20 రోజుల కిందట చెత్త ఏరుకుంటూ భద్రాచలం చేరుకున్నారు. బుధవారం మధ్యాహ్నం సతీశ్ భద్రాచలంలోని చర్ల రోడ్డులో ఉన్న ఓ డ్రెయినేజీ వద్ద ప్లాస్టిక్ సీసాలు తీసుకోవడానికి వెళ్లాడు. అప్పటికే భారీ వర్షంతో వివిధ కాలనీల నుంచి ఈ డ్రెయినేజీ ద్వారానే నీరు స్లూయిస్ నుంచి గోదావరిలోకి వెళ్తోంది. ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడిన సతీశ్ ప్రవాహం అధికంగా ఉండటంతో గల్లంతయ్యాడు. అప్పటికే భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్, టౌన్ సీఐ సంజీవరావు ఆధ్వర్యాన సిబ్బంది చెత్త తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. విషయం తెలియగానే గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాసరావు చెత్తను తొలగింపు పనులు ముమ్మరం చేయించి డ్రెయినేజీ ద్వారా నీటి ప్రవాహన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టగా.. కల్వర్టు రెండో వైపు నుంచి వ్యక్తి గల్లంతైన ప్రాంతం వద్దకు సిబ్బంది టార్చ్‌లైట్ల సాయంతో వెళ్లారు. ఈ క్రమంలో సతీశ్ విగతజీవిగా ఉండగా.. ఆయనను బయటకు తీసుకొచ్చేలోగా అక్కడే ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. తన కళ్ల ముందే కాల్వలో పడిన భర్త సతీశ్ మృతి చెందడంతో ఆయన భార్య సునీత కన్నీరుమున్నీరుగా విలపించింది. కాగా, గ్రామపంచాయతీ సిబ్బంది మూడున్నర గంటల పాటు శ్రమించినా ఆయనను కాపాడలేకపోవడం విషాదాన్ని నింపింది.

పోలీసులమని బెదిరించిన నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేశ్‌కుమార్

కొత్తగూడెంటౌన్: పోలీసులమంటూ యువకులను బెదిరించి దాడి చేసిన నలుగురిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రమేశ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 4వ తేదీన రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ వద్ద కొత్తగూడెంనకు చెందిన విద్యార్థులు ఆకాష్, తరుణ్, జశ్వంత్ రీల్స్ చేసుకుంటుండగా.. పెనగడపకు చెందిన ఎస్‌కే యాకూబ్ గౌరీ, ఎగ్గడి అశోక్, వడ్డే మనోజ్, పులిచర్ల శరత్‌చంద్ర బెదిరించారు. పోలీసులమని బెదిరిస్తూ గంజాయి బ్యాచ్ అంటూ డబ్బు డిమాండ్ చేయగా విద్యార్థులు గుర్తింపు కార్డులు అడిగారు. దీంతో తమనే కార్డులు అడుగుతారా అంటూ దాడి చేయడంతో అందులో ముగ్గురు పారిపోయి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులను గుర్తించి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రమేశ్‌కుమార్ తెలిపారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత



స్వాధీనం చేసుకున్న సరుకుతో ఎక్సైజ్ ఈఎస్ జానయ్య, ఉద్యోగులు

- ఇద్దరు వ్యక్తుల అరెస్టు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రంతో పాటు లక్ష్మీదేవిపల్లి మండలంలో ఎక్సైజ్, ప్రొహిబిషన్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించి రూ.2.50 లక్షల విలువ చేసే నల్లబెల్లం, పటిక, నాటుసారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ ఎస్.జానయ్య వివరాలు వెల్లడించారు. లక్ష్మీదేవిపల్లి మండలం నూనావత్‌తండాకు చెందిన లాకవత్ రవి ద్విచక్రవాహనంపై 3 లీటర్ల నాటుసారా, 28 కేజీల నల్లబెల్లం, పటికతో వెళ్తుండగా ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. అనంతరం పోలీసులు రవిని విచారించగా తాను నల్లబెల్లం, పటికను కొత్తగూడెంలోని పెద్దబజార్‌కు చెందిన వ్యాపారి దేవికిషన్ లడ్డా దగ్గర కొనుగోలు చేశానని చెప్పడంతో పోలీసులు వ్యాపారి దుకాణం, గోడౌన్‌కు వెళ్లి తనిఖీలు చేశారు. ఈ క్రమంలో 1,876 కేజీల నల్లబెల్లం, 3,950 కేజీల పటికను గుర్తించి సీజ్ చేశారు. నల్లబెల్లాన్ని ఏపీ నుంచి తీసుకొచ్చి కొత్తగూడెంలో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వ్యాపారిపై ఇల్లెందుతో పాటు పలు పోలీస్ స్టేషన్లలో గతంలో కేసులు నమోదై ఉన్నాయని, నల్లబెల్లం విక్రయాలు ఆపకపోతే లడ్డాపై పీడీ యాక్ట్ మోపుతామని జానయ్య తెలిపారు. బెల్లం, పటికతోపాటు 3 లీటర్ల గుడుంబా, బైక్‌ను సీజ్ చేశామని, దేవికిషన్ లడ్డా, లకావత్ రవిని అరెస్టు చేశామని వివరించారు. సమావేశంలో ఎక్సైజ్ ఏఈఎస్ కరంచంద్, సీఐ జయశ్రీ, ఎస్‌ఐ రమేశ్, డీటీఎఫ్ ఎస్‌ఐ గౌతమ్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి రవాణా కేసులో ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మధు

మధిర: గంజాయి రవాణా చేస్తూ ముగ్గురు పట్టుబడగా కేసు నమోదు చేసినట్లు మధిర సీఐ మధు తెలిపారు. మధిరలోని కార్యాలయంలో బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఎర్రుపాలెం మండలం రేమిడిచర్ల వద్ద బుధవారం చేపట్టిన వాహన తనిఖీల్లో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించగా వివరాలు ఆరా తీశామని చెప్పారు. వీరిని తమ్మిశెట్టి ఏసోబు, రామిశెట్టి యుగంధర్, భూక్యా అనూష్‌గా గుర్తించగా ఏపీలోని సీలేరులో మధు వద్ద నుంచి గంజాయి కొని మధిరలో అమ్మేందుకు వస్తున్నట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వీరి నుంచి 780గ్రాముల గంజాయి, బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. కాగా, గంజాయి అమ్మే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని.. యువత నడవడికపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎర్రుపాలెం ఎస్‌ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

సింగరేణిలో ఉద్యోగాలకు ముగిసిన పరీక్షలు

- 327 పోస్టులకు 29,291 మంది హాజరు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో 327 ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల భర్తీకి ఈనెల 6, 7 తేదీల్లో నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షకు 29,291 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో 32 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా 84 శాతంగా హాజరు నమోదైందని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ వెల్లడించారు. వారం రోజుల్లో ప్రాథమిక కీ విడుదల చేసి.. నెలాఖరులోగా ఫలితాలు వెల్లడించనున్నట్లు తెలిపారు. గత నెల 20, 21 తేదీలలో 272 పోస్టులకు, ఇప్పుడు 327 పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహించగా ఈ ఏడాది సింగరేణి సంస్థ నిర్దేశించుకున్న 599 ఎక్స్‌టర్నల్ పోస్టుల పరీక్షలు పూర్తయ్యాయని చెప్పారు. కాగా, పూర్తి పారదర్శకంగా, సీసీ కెమెరాల నీడలో పరీక్షలు నిర్వహించడంతో పాటు హైదరాబాద్‌లోని కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షించామని సీఎండీ తెలిపారు. నియమకాలకుప్రతిభే కొలమానమని, ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికితే మోసపోవద్దని సూచించారు.

నాట్లు వేసిన తహసీల్దార్



మహిళా కూలీలతో కలిసి నాట్లు వేస్తున్న తహసీల్దార్

కరకగూడెం: నిత్యం విధి నిర్వహణలో తలమునకలయ్యే కరకగూడెం తహసీల్దార్ నాగప్రసాద్ బుధవారం కాసేపు వరి నాట్లు వేశారు. ఆయన కార్యాలయానికి వస్తుండగా కలవలనాగారంలో ఓ రైతు పొలంలో మహిళా కూలీలు నాట్లు వేస్తున్నారు. దీంతో తహసీల్దార్ సైతం కాసేపు నాట్లు వేసి రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు.

నేడు పామాయిల్ రైతులకు అవగాహన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారంవారిగూడెం సమీపాన ఉన్న ఆయిల్‌ఫెడ్ డివిజనల్ కార్యాలయం(నర్సరీ)లో గురువారం పామాయిల్ సాగుదారులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు ఆయిల్‌ఫెడ్ డివిజనల్ అధికారి ఆకుల బాలకృష్ణ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ సదస్సు మొదలవుతుందని పేర్కొన్నారు. ఆయిల్‌పాం శాస్త్రవేత్త డాక్టర్ బీఎస్ రావు, భద్రాద్రి డీహెచ్‌ఎస్‌ఓ తదితరులు పాల్గొని సాగులో మెళకువలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

ఆర్టీసీ బస్సు, స్కార్పియో ఢీ



పొలాల్లోకి దూసుకెళ్లి స్కార్పియో

దుమ్ముగూడెం: మండలంలోని బైరాగులపాడు గ్రామ శివారులో ఆర్టీసీ బస్సు.. స్కార్పియో ఎదురెదురుగా ఢీకొన్నాయి. చర్ల మండలం రైస్‌పేట గ్రామానికి చెందిన కుప్ప విద్యారణ్య, స్నేహితుడు బీరాకురి వినోద్‌కుమార్‌తో కలిసి స్కార్పియోలో ఖమ్మం వెళ్తున్నారు. బైరాగులపాడు గ్రామ శివారులో మూలమలుపు వద్ద భద్రాచలం నుంచి చర్ల వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. స్కార్పియో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో స్కార్పియో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లగా విద్యారణ్య కుడిచేయికి తీవ్రగాయమైంది. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ గణేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టును ఢీకొట్టిన కారు



ఘటనా స్థలంలో కారు

చర్ల: మండలంలోని సుబ్బంపేట శివారులో బుధవారం తెల్లవారుజామున ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వెంకటాపురం వైపు నుంచి చర్ల వైపునకు వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లడమే కాక చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు కాగా స్థానికులు వారిని వెంకటాపురం మీదుగా ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు.

పాండురంగాపురంలో చోరీ

పాల్వంచరూరల్: మండలంలోని పాండురంగాపురం గ్రామంలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన పోతురాజు కృష్ణ మంగళవారం బీరువాలో డ్వాక్రా గ్రూపునకు చెల్లించాల్సిన రూ.20 వేల నగదు, అర తులం బంగారు చెవిదిద్దులు దాచి పెట్టి వ్యవసాయ పనులకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి బీరువాలోని నగదు, నగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితులు బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

భద్రాచలం.. జలదిగ్బంధం

- నీట మునిగిన విస్తా కాంప్లెక్స్, నిత్యాన్నదాన సత్రంలోకి నీరు
- సహాయక చర్యలపై మంత్రి తుమ్మల ఆదేశం
- ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్ పాటిల్
- స్వల్పంగా పెరిగిన గోదావరి నీటిమట్టం



బొమ్మల దుకాణాల్లోకి చేరిన నీరు



కుసుమ హరినాథ ఆలయం వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్

భద్రాచలం: భద్రాచలంలో బుధవారం వాన దంచి కొట్టింది. తెల్లవారుజామున ప్రారంభమైన వాన మధ్యాహ్నం వరకు ఆగకుండా కురవడంతో పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రెయినేజీలు పొంగి పొర్లడంతో రోడ్డు మీదకు వరద పారింది. పట్టణంలోని వరద గోదావరిలోకి వెళ్లే స్లూయిజ్‌లు మూయడం.. అకస్మాత్తుగా భారీ వర్షం కురవడంతో ఊహించని రీతిలో రామాలయం చుట్టుపక్కల వరద చేరింది. విస్తా కాంప్లెక్స్, బొమ్మల దుకాణాలు, నిత్యాన్నదాన సత్రంలోకి నీరు చేరగా రామాలయంలోకి రావడానికి భక్తులు ఇబ్బంది పడ్డారు. అలాగే, అశోక్‌నగర్ కొత్తకాలనీ ఇళ్లలోకి సైతం నీరు చేరగా స్థానికులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పునరావాస శిబిరాల్లో ఉన్న తమను బలవంతంగా పంపించారని.. ఇప్పుడు మళ్లీ వరద రావడంతో ఇబ్బంది పడాల్సి వస్తోందని వాపోయారు.

పరిస్థితులు చక్కదిద్దండి..

భద్రాచలం రామాలయం సమీపాన అన్నదాన సత్రం వద్ద వరద నిలిచిందని తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. స్లూయిజ్‌లను వెంటనే తెరిచి నీరు ఖాళీ చేయించాలని ఆదేశించారు. అలాగే, రామాలయానికి సమీపాన శ్రీ కుసుమ హరినాథ బాబా ఆలయం వద్ద పగోడా కుంగిన విషయమై కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. చుట్టుపక్కల వారికి ఎలాంటి ఇబ్బంది ఎదురుకాకుండా మండపాన్ని తొలగించాలని సూచించారు. ఈ మేరకు కలెక్టర్ జితేశ్ వి పాటిల్ భద్రాచలం చేరుకుని హరినాథ ఆలయం చుట్టుపక్కల ప్రాంతాలే కాక నిత్యాన్నదాన సత్రం, విస్తా కాంప్లెక్స్‌ను పరిశీలించారు. వరద నీటి మళ్లింపు, ఇతర సహాయక చర్యలపై రెవెన్యూ, పోలీసు అధికారులకు సూచనలు చేశారు. కాగా కలెక్టర్ ఆదేశాలతో ఎన్‌డీఆర్‌ఎఫ్, పోలీసు సిబ్బంది హరినాథ ఆలయం చుట్టుపక్కలకు ఎవరూ వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. అంతేకాక పోలీస్, రెవెన్యూ, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది కలిసి ప్రమాదకరంగా మారిన పగోడాను తొలగించారు.

కాస్త పెరిగిన గోదావరి

భద్రాచలం వద్ద బుధవారం గోదావరి నీటిమట్టం స్వల్పంగా పెరిగింది. ఉదయం 8 గంటలకు 32.90 అడుగులు, మధ్యాహ్నం ఒంటి గంటకు 33.70 అడుగులు ఉండగా 3 గంటలకు 34.20 అడుగులుగా నమోదైంది. ఎగువన తాలిపేరు నుంచి వరద గోదావరిలో చేరుతుండడంతో ఇంకాస్త పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

రాష్ట్ర అథ్లెటిక్స్ టోర్నీలో ఆరు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులతో అసోసియేషన్ బాధ్యులు

కొత్తగూడెంటౌన్: హైదరాబాద్‌లో నిర్వహించిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో జిల్లా క్రీడాకారులు పది మంది పాల్గొనగా ఆరుగురు పతకాలు సాధించారని అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.మహీధర్ తెలిపారు. హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో బుధవారం జరిగిన పోటీల్లో జిల్లాకు మూడు బంగారు, రెండు రజత, ఒక కాంస్య పతకాలు దక్కాయని వెల్లడించారు. భద్రాచలానికి చెందిన ఎస్‌కే అఫ్రిన్, టి.శ్రీతేజ, గండుగులపల్లికి చెందిన ఎం.సురేఖ జావెలిన్ త్రోలో బంగారు పతకాలు, పాల్వంచకు చెందిన ఎస్.మహేశ్వరి జావెలిన్ త్రోలో రజత పతకం, కొత్తగూడెంనకు చెందిన జె.దీక్షిత్ 100 మీటర్ల పరుగుపందెంలో రజత పతకం సాధించారు. అంతేకాకుండా భద్రాచలానికి చెందిన ఎం.శ్రీవిద్యధార 400 మీటర్ల పరుగులో కాంస్య పతకం గెలుచుకున్నారని మహీధర్ తెలిపారు. క్రీడాకారులను కోచ్‌లు పి.నాగేందర్, జన్ను గిరిప్రసాద్, మల్లికార్జున్, పీడీ శ్వేత, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు గొట్టపు రాధాకృష్ణ తదితరులు అభినందించారు.

విద్యుత్ వినియోగంలో బాధ్యతగా ఉండాలి

- వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ వేణుగోపాలచారి



దరఖాస్తులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ వేణుగోపాలచారి

చండ్రుగొండ: విద్యుత్ వాడకంలో వినియోగదారులు సైతం బాధ్యతగా ఉండాలని వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ ఎన్వీ వేణుగోపాలచారి అన్నారు. చండ్రుగొండ రైతువేదికలో బుధవారం ఏర్పాటు చేసిన వినియోగదారుల సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించాక చైర్‌పర్సన్ మాట్లాడారు. ప్రతీ సమస్యకు పరిష్కారమార్గం చూపాలని ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు కె.రమేశ్, ఆర్.చరణ్‌దాస్, ఎన్.నరేందర్, ఎస్‌ఏఓ మురళి, డీఈ జె.రాంబాబు, ఏడీఈ ఎం.యాసిన్, ఏఈలు నర్సింహారావు, జి.కిషన్, ఎస్.సతీశ్, ఎస్.తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దమ్మపేట: మద్యం మత్తులో పురుగులమందు తాగి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని ముష్టిబండ గ్రామంలో చోటు చేసుకోగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ముష్టిబండకు చెందిన చిలకా మల్లేశ్ (50) కూలీ పని చేస్తూ వచ్చిన డబ్బుతో మద్యం సేవించేవాడు. సోమవారం ఆయన భార్య.. మల్లేశ్‌ను మందలించగా మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై బుధవారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.